# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 05 అక్టోబరు , 2026 | పేజీలు : 4





## కార్మికుల సంక్షేమమే ఏకైక లక్ష్యం




# ప్రశ్నించి పోరాడే జెఎసి కూటమి గెలిపిద్దాం

అద్దె యూనియన్ల మాయలో పడొద్దు.. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటేయాలి

ఆర్‌టిసి కార్మికుల పక్షాన శాసనమండలి లో గళం విప్పుతా

గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

# బస్సులు ఉన్నాయి..కానీ బస్టాండ్‌కు రావు!

నాగార్జునసాగర్ ప్రయాణికుల గోడు పట్టించుకునేదెవరు?



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌కు వచ్చే పర్యాటకులు,స్థానిక ప్రయాణికుల రవాణా సౌకర్యాల విషయంలో నెలకొన్న పరిస్థితిపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన బస్సులు తెలంగాణ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నాగార్జునసాగర్ బస్టాండ్‌లోకి వచ్చి రాకపోకలు సాగించకపోవడం ఒక సమస్యగా మారితే తెలంగాణ ప్రాంతానికి చెందిన బస్సుల తీరుపైనా ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆర్టీసీ బస్సులు నాగార్జునసాగర్ మీదుగా ఆంధ్ర వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. అదే బస్సులు తిరిగి నాగార్జునసాగర్ మీదుగా హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న సందర్భాల్లో సాగర్‌లో ముఖ్యమైన స్టేజీ ఉన్నప్పటికీ బస్టాండ్ వరకు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోకపోవడానికి ఎందుకు వెనుకాడుతున్నాయన్న ప్రశ్న స్థానికుల నుంచి వినిపిస్తోంది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన బస్సులకు తెలంగాణ ప్రయాణికుల ఇబ్బందులు పట్టకపోయినా తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆర్టీసీ బస్సులకు మాత్రం తెలంగాణ ప్రయాణికుల బాధ ఎందుకు పట్టడం లేదన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.నాగార్జునసాగర్ కేవలం ఒక సాధారణ పట్టణం కాదు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రం నిత్యం పర్యాటకులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతంలో బస్టాండ్ ఉన్నప్పటికీ బస్సులు ఊరు బయట హైవే మీదఆగడం వలన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లాల్సిన అత్యవసర ప్రయాణికులు బస్సుల కోసం ప్రధాన రహదారుల వద్దకు వెళ్లాల్సి రావడం, గత్యంతరం లేక ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి రావడం అదనపు భారం మాత్రమే కాకుండా భద్రతాపరమైన ఆందోళనలకు కూడా కారణమవుతోంది. ఇక రాత్రి సమయంలో అయితే స్థానికుల బాధ వర్ణనాతీతం.

ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ మీదుగా రాకపోకలు సాగించే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కు చెందిన ప్రతి బస్సు తప్పనిసరిగా నాగార్జునసాగర్ బస్టాండ్ లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని,దించుకునేలా అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. పర్యాటక కేంద్రంగా ఉన్న సాగర్‌లో ప్రయాణికుల రవాణా సౌకర్యాన్ని దృష్టిలోఉంచుకుని ఈ విషయంలో తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### మూసీ రోడ్డుకు మరమ్మతుల
# మోక్షమెప్పుడో?

ఎగిరిపడిన రాళ్లు.. పగిలిన మెడికల్ షాపు గ్లాసులు

వర్షాకాలంలో బురద.. ఎండాకాలంలో దుమ్ము:

పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :**పట్టణ నడిబొడ్డున ఉన్న మూసీ రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచారులతో పాటు స్థానిక వ్యాపారులకు చుక్కలు చూపిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా,పాలకులు, అధికారులు మారుతున్నా ఈరహదారి దిశా మొగమూ మాత్రం మారడం లేదని స్థానికులు, వ్యాపారవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తప్పని నరకయాతన :** ఈ రహదారిపై వర్షం పడితే గుంతలు జలమయమై బురద గుంటలను తలపిస్తుండగా,ఎండాకాలంలో లేచే దుమ్ము,ధూళితో పరిసర ప్రాంతాల ప్రజలు రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇరుకైన ఈ రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉండటం, దానికితోడు వాహనాలను రహదారిపైనే అడ్డదిడ్డంగా నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అనేక రైస్ మిల్లులు, ట్రాన్స్పోర్ట్ సంస్థలకు,వెళ్లే భారీ లారీలు స్కూల్ బస్సులకు నిత్యం తిరుగుతుండటంతో పాఠశాల వేళలు,ఉదయం,సాయంత్రం సమయాల్లో భారిగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.ఆర్అండ్‌బీ,మున్సిపాలిటీ అధికారుల మధ్య బాధ్యతల గందరగోళం వల్లనే ఈ సమస్య దశాబ్దాలుగా నలుగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

**మనిషికి తగిలుంటే ప్రాణాలకే ప్రమాదం :** శనివారం ఈ రహదారిపై వెళ్తున్న ఒక వాహన టైరు కిందపడి పక్కకు తీవ్ర వేగంతో లేచివచ్చిన కంకర రాయి, శ్రీ రామకృష్ణ మెడికల్ షాప్ ముందు ఉన్న అద్దాలను బలంగా తాకడంతో గ్లాసులు పూర్తిగా ధ్వంసం అయిందని నిర్వాహకుడు శ్రీధర్ తెలిపారు. ఈ ఘటనలో వ్యాపారికి సుమారురూ.15,000 వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఆయన పేర్కొన్నారు రాయి వచ్చి గ్లాసుకు తగిలి పగిలిపోయింది కాబట్టి సరిపోయింది.. అదే వేగంతో వచ్చి ఏ మనిషికో లేదా తలకో తగిలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది! రోడ్డు సరిగా లేకపోవడం వల్ల ప్రాణ భయంతో బతకాల్సి వస్తోంది అని స్థానిక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు.కనీసం నడవడానికి అనుకూలంగా ఉండే రోడ్డును కూడా నిర్మించకపోవడం శోచనీయమని వ్యాపారవేత్తలు మండిపడ్డారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు,పాలకులు తక్షణమే స్పందించి మూసీ రోడ్డును ఆధునీకరించి, నూతన రహదారిని నిర్మించాలని లేక కనీసం మరమతులన్న చేపట్టాలని నకిరేకల్ ప్రజలు,వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## మహేశ్వర్ గౌడ్ విద్యావేత్త

**ప్రజాపక్షం/అర్వపల్లి :** చైతన్యభారతి విద్యామందిర్ హైస్కూల్ వ్యవస్థాపకులు, ప్రధానోపాధ్యాయులు కేశగాని మహేశ్వర్ గౌడ్ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేసిన విద్యావేత్త అని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించి వారి జీవితాల్లో మార్గదర్శకులుగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన సేవలను ఎప్పటికి మరువలేమన్నారు. ఆయన మృతి విద్యారంగానికి, పూర్వ విద్యార్థులకు, కుటుంబ సభ్యులకు తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో 200607 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు, స్నేహితులు పాల్గొన్నారు.

## ఘనంగా మాస కల్యాణం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పునర్వసు జన్మ నక్షత్రం సందర్భంగా ఆదివారం మాస కళ్యాణంను జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీవేదాంత భజన మందిరంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు అలంకరింప జేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా మాంగల్య దారణతో కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు, కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, భక్తులు ఈగ వెంకటేశ్వర్లు, శీలా శంకర్, సోమ సుమన్, వీరవెల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలు

**ప్రజాపక్షం/నాంపల్లి :** దివ్య చక్ర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సీహెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో, శ్రీహిత హాస్పిటల్ చైతన్యపురి, హైదరాబాద్ సౌజన్యంతో నాంపల్లి మండలం మెల్లదొరవాయి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.డాక్టర్ శివప్రసాద్ ,డాక్టర్ శ్రీకాంత్‌రోగులను పరీక్షించి ఆరోగ్య సమస్యలపై సూచనలు, సలహాలు అందించారు. ఇప్పటివరకు 70 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ కొండల్ రెడ్డి,డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్, దేవేందర్, నిర్వాహకులు,వైద్య సిబ్బంది, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ఏకతాటిపై నడిపించడానికి రచయితల సంఘం కృషి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సాహితివేత్తలను, రచయితలను, కవులను, కళాకారులను ఏకతాటిపై నడిపించడానికి రచయితల సంఘం కృషి చేస్తుందని మనం వికాస్ వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2లో రచయితల, కవుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట నియోజక వర్గ రచయితల సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రచయితలు, కవులు సమాజాన్ని మేల్కొలిపే విధంగా రచనలు చేసేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రచనలు వెలుగులోకి తెచ్చి సమాజం చైతన్యానికి రచయితల సంఘం ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం కమిటిని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ రచయిత బెల్లంకొండ శ్రీరాములు, సంఘం అధ్యక్షులుగా శీలా అవిలేను, ప్రధాన కార్యదర్శిగా గొడితాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పబ్బతి వెంకటేశ్వర్లు, పోతుగంటి వీరాచారి, కార్యదర్శులుగా మెంతబోయిన సైదులు, ఏబెల్ శశి, మహిళా కార్యదర్శిగా ఎన్‌సి రోజా, కార్యవర్గ సభ్యులుగా గడ్డం కృష్ణారెడ్డి, ఆలకుంట్ల లింగయ్య, కందుకూరి యాదగిరి, లింగాల శ్రీనివాస్, విజయ్ కుమార్, వనం మంజుభార్గవి, షేక్ అలీమొద్దీన్, కుసుమ సిద్ధారెడ్డిలను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

## కాంగ్రెస్ పాలనలో పడకేసిన గ్రామ స్వరాజ్యం...

**ప్రజాపక్షం/డిండి;** కాంగ్రెస్ ప్రజా పాలనలో గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ఎక్కడా కనిపించడం లేదని అభివృద్ధికి ఆమడ దూరంలో నేడు గ్రామాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని బిఆర్ఎస్ డిండి మండల నాయకులు ఓర్సు ముత్యాలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు దోమల కారణంగా వైరల్ ఫీవర్లకు, డెంగ్యూ వ్యాధులకు గురవుతున్నా కనీసం గ్రామాల్లో ఎక్కడా ఫోగింగ్ కనిపించడం లేదని, ఉద్యమంలా నడిచే హరిత హారాన్ని గాలికొదిలేసారని అన్నారు. గ్రామాలకు వెళ్లి రోడ్లతో పాటు ప్రధాన రహదారులు సైతం గడ్డి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పట్టించుకునే నాధుడే లేడని అన్నారు. ప్రజా పాలనలో అధికారులు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు తప్ప ఎక్కడా తన కర్తవ్యాన్ని నేరవేర్చడం లేదని అన్నారు. మాజీ సిఎం కేసీఆర్, బిఆర్ఎస్ పాలనలో గ్రామాల రోడ్లు, హరిత హారం, ప్రతి గ్రామంలో పారిశుద్య పనులతో పండగలా గ్రామాల అభివృద్ధి జరిగి గ్రామాలు గ్రామ స్వరాజ్యం దిశగా నడిచాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలను అన్ని రకాలుగా ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని అన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మారుమూల గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని రవీందర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, శంకర కంటి హాస్పటల్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో, సంకినేని కమలమ్మ రామారావు జ్ఞాపకార్థం ఎస్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇటువంటి వైద్య శిభిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని అంటారని కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఐ క్యాంప్‌లో సర్వీస్ అందించిన సూర్యాపేట శ్రీలక్ష్మి పారామెడికల్ కళాశాల విద్యార్థులను అభినందించారు. శిభిరంలో 160 మంది కంటి సమస్యలతో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోగా 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి తదుపరి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, ఐ క్యాంప్ కోఆర్డినేటర్ శివరంగ, గౌరిశెట్టి అప్పారావు, దేవరకొండ సాయికుమార్, కోదాడ స్టాలిన్ పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పట్టణ పరిధిలో విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డుల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, విద్యార్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు నమోదుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జీలు, ముఖ్య నాయకులు తమ తమ వార్డులలో అందుబాటులో ఉన్న పట్టభద్రులను గుర్తించి, దరఖాస్తు ప్రక్రియకు అవసరమైన పూర్తి సహకారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.ఇలియాస్‌ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి.మగ్దుంపాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు, పెండ్యాల పద్మావతి, షెహానాజ్ బేగం, కుర్ర చైతన్య, మాలి రేణుక, దైద సత్యం, దీపిక విజయ్, లావూరి సుధాకర్ పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు ఆదివారం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో మనమందరం అత్యంత కీలకమైన అంశంపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఏర్పడిందని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన ఎల్‌నినో వాతావరణ ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందన్నారు. ఎండల తీవ్రత విఫరీతంగా పెరగడంతో భూమి వేడెక్కి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. ఇష్టానుసారంగా నీటిని వృధా చేస్తే, రాబోయే కాలంలో మున్సిపాలిటి తరుపున కఠినమైన ఆంక్షలు, చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామంలో ఆదివారం అపెక్స్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ సమక్షంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి అపెక్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అశోక్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రజలకు సీజనల్ జ్వరాలు,బ్లడ్ షుగర్ తదితర ఆరోగ్య సమస్యలకు సంబందించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించి మందులను ఉచితంగా పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కడియం రాంబాబు, సోమన్న, శ్రీను, సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే శిక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కరాటే విద్య ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ ఆవరణలో సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి హాజరై కరాటే ప్రతిభ కనబరిచిన దాదాపు 100 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, కలర్ బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ జాతీయ అధ్యక్షుడు బూడిద సైదులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ ముట్టపాక శీను, 5వ వార్డు ఇన్‌ఛార్జ్ జోహార్, కరాటే మాస్టర్లు పాండవ శివ, భారతి, ప్రవల్లిక, అజయ్, కిషోర్, అరుణ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల;** త్వరలో జరగబోయే నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య తెలిపారు. ప్రభుత్వ నిబందనల ప్రకారం పట్టభద్రులు తమ పూర్తి వివరాలతో కూడిన ఫామ్18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యా వంతులైన పట్టభద్రులు చైతన్యవంతంగా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొన్నాలని సూచించారు. గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికి ఎంఎల్‌సి ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు కొత్తగా మరళ ఆన్‌లైన్, నేరుగా అయిన ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు.



## రాష్ట్ర ఉత్తమ సామాజిక వేత్తకు సన్మానం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : వయోవృద్ధుల భద్రత, గౌరవం, ఆరోగ్యం, పోషణ, సంరక్షణ రంగాల్లో విశిష్ట సేవలందించిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుడుగుంట్ల విద్యాసాగర్‌కు రాష్ట్ర ఉత్తమ సామాజికవేత్త అవార్డు లభించిన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గల అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, దండ వెంకటరెడ్డి, కొప్పుల మోహన్ రావు, కందిబండ సూరయ్య, ఈదుల శంకరయ్య, వెంపటి సురేష్, కాకి మల్లారెడ్డి పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆశీర్వాదం



ప్రజాపక్షం/నకిరేకల్ :చీకటిగూడెంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ దాచేపల్లి నాగేశ్వరరావునర్మద దంపతుల కుమార్తె హర్షిత,అక్షితల నూతన పట్టు వస్త్రలంకరణ ఈకార్యక్రమానికి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్,డీసీఎంఎస్ చైర్మన్ బొళ్ల వెంకటరెడ్డితో కలిసిహాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెరుమళ్ల శేఖర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కోట పుల్లయ్య, నూనె కోటి, మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డి,బడుగుల రవీందర్,ప్రభాకర్,ముద్దం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బోను ఏర్పాటు



ప్రజాపక్షం/డిండి; కోతుల బెడదను నివారించడం కోసం ప్రత్యేకమైన గుండ్లపల్లి గ్రామంలో ప్రత్యేకమైన బోన్ ఏర్పాటు చేసి,వాటి నుండి కోతులు పట్టివేత పట్టి అడవి ప్రాంతంలో వదిలివేయాలని బోన్ ఏర్పాటు చేశారు. దాదాపు బోనులో 350 వరకు కోతులు చేరగా అడవిలో వాటిని వదిలారు. ప్రజలందరూ కోతులను బోన్ ద్వారా పట్టే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లగంతుల రవి, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/నకిరేకల్ :నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఉదయం 9 గంటలకు పన్నాలగూడెంలోని నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించనున్నారు.చెక్కులు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులు అందుకోవాలని క్యాంపు కార్యాలయం సూచించింది.

## మాస్టరు వేషం ధరించి... డ్రగ్స్‌పై అవగాహన పెంచి



ప్రజాపక్షం/నకిరేకల్: యువతను పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిపై విద్యార్థుల్లో చైతన్య జ్యోతి వెలిగించేందుకు ఓ ఉపాధ్యాయుడు వినూత్న బాట పట్టారు.క్లాస్‌రూమ్‌లో పాఠాలు చెప్పడమే కాదు..సమాజ హితమే ధ్యేయంగా నకిరేకల్ పట్టణంలో ఆదివారం వారసంత సందర్భంగా సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు,సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ విచిత్ర వేషధారణతో ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.డ్రగ్స్,గంజాయి,పొగాకు,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి ముందుకు సాగాలని కోరారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు.మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని వివరించారు. ‘నో డ్రగ్స్.. సేవ్ లైఫ్’ నినాదంతో మైక్‌సెట్, ఫ్లెక్సీలు,కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. మరుగునపడుతున్న జానపద కళలను ప్రజలకు పరిచయం చేయడం కూడా కార్యక్రమ ఉద్దేశమని ఆయన తెలిపారు.

## నాగార్జునసాగర్‌లో 108 సేవలు ప్రశంసనీయం



ప్రజాపక్షం/నందికొండ :స్థానిక మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు అత్యవసర సమయాల్లో ప్రజలకు ఆపన్నహస్తంగా నిలుస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు,పాముకాటు,విషప్రయోగం,ఆకస్మిక అనారోగ్యం,గర్భిణులు,వృద్ధులు, చిన్నారుల అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందిస్తూ బాధితులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలిస్తున్నారు.108 సిబ్బంది ఈఎంటీలు రాకేష్, గోవర్ధన్,పైలట్లు శంకర్,గణేష్ సమన్వయంతో సేవలందిస్తున్నారు. రోగి పరిస్థితిని వేగంగా అంచనా వేసి అవసరమైన ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు ట్రాఫిక్‌లోనూ అంబులెన్స్‌ను జాగ్రత్తగా నడిపిస్తూ బాధితులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడంలో సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు.సమయస్ఫూర్తి, బాధ్యత, మానవత్వంతో సేవలందిస్తున్న రాకేష్, గోవర్ధన్, శంకర్, గణేష్‌లను నాగార్జునసాగర్ పరిసర ప్రాంత ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ప్రజల అభిప్రాయం : అత్యవసర సమయంలో సకాలంలో చేరుకుని మా కుటుంబ సభ్యుడికి చికిత్స అందించిన 108 సిబ్బంది సేవలు ఎంతో విలువైనవి. మారుమూల ప్రాంతాలకు సైతం సేవలు అందిస్తూ ప్రాణాలను కాపాడుతున్న వారి సేవలు కొనసాగాలి" అని స్థానికులు కోరుతున్నారు.

## దళిత మహిళ మాధవిపై దాడిని ఖండించిన ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి

ప్రజాపక్షం/నలగొండ టౌన్: చింతపల్లి మండలం వీకే మల్లేపల్లి గ్రామంలో గ్రామసభ సందర్భంగా దళిత మహిళ, వీవోఏ గనిపర్తి మాధవిపై జరిగిన దాడిని ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి నాయకులు తీవ్రంగా ఖండించారు.నిందితులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు.గ్రామసభలో మాధవిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటనపై వీడియో కూడా వెలుగులోకి వచ్చిందని,ఇది ప్రజాస్వామ్య సమాజంలో ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు.గ్రామసభలు ప్రశాంతంగా జరగాల్సి ఉండగా మహిళను కులపరంగా అవమానించడం,దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని,బాధితురాలికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు

## అదుపుతప్పి బావిలో పడిన బైక్, ప్రాణాపాయంలో వ్యక్తి



ప్రజాపక్షం/నలగొండ టౌన్: ప్రమాద వశాత్తు బైక్ అదుపు త ప్పి బావిలో పడటంతో ఓ వ్యక్తి ప్రాణాపాయంలో చిక్కుకు న్నాడు.ఈ ఘటన మండలంలోని కంచనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సమాచారం అందు కున్న 108 అంబులెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించి,చాకచ క్యంగా వ్యవహరించి బా ధితుడిని సురక్షి తం గా బయటకు తీసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశారు.వివరాల్లోకి వెళ్తే కంచనపల్లి గ్రామానికి చెందిన బీర్ల వీరయ్య (60)ప్రతిరోజు మాదిరిగానే ఉద యం 10 గంటల సమయంలో బైక్‌పై బయటకు బయలుదేరాడు. ఈక్రమంలో ప్రమాదవ శాత్తు బైక్ అదుపుతప్పి సమీపంలోని బావిలో పడిపోయింది.ఈప్రమాదంతో వీరయ్య బావిలో చిక్కు కుపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తు లు ఏమాత్రం ఆలస్యం చేయ కుండా వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.దీంతో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బం ది పరిస్థి తిని పరిశీలించారు.బావిలో ఉన్న బాధితుడిని బయటకు తీసుకు రావడానికి అంబులెన్స్‌లోని స్పైన్ బోర్డును వినియోగించాలని నిర్ణయించారు. బావిలో ఉన్న బాధితుడిని బ యటకు తీసుకు రావడానికి అంబులెన్స్‌లోని స్పైన్ బోర్డును వినియోగించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈఎంటీ సత్యనారా యణ, పైలట్ కోటేష్ ధైర్యసా హసాలు ప్రదర్శించారు. బావిలోకి దిగి,బాధితుడిని స్పైన్ బోర్డుకు జాగ్రత్తగా కట్టి,గ్రామస్తుల సహ కారంతో పైకి తీసుకొచ్చారు. అనంతరం అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## కాన్షీరామ్ వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాపక్షం/నకిరేకల్ : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బహుజన ఉద్యమ నిర్మాత మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి కార్యక్రమాల కరపత్రాలను డీఎస్4 బీఎస్‌పి భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కత్తుల కాన్షీరామ్ నకిరేకల్‌లో ఆవిష్కరించారు.బహుజనులకు రాజకీయ అధికారం సాధించడమే కాన్షీరామ్ లక్ష్యమని,ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్టుపల్లి కాశీరాం,జిల్లా నాయకులు గిరి,కృష్ణ,నరసింహ,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మండల వార్డ్ మెంబర్ల ఫోరం కమిటీ



ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ : తెలంగాణ రాష్ట్ర వార్డ్ మెంబర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆదేశానుసారం,రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలగిరి సాగర్ మండల వార్డ్ మెంబర్ల ఫోరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా రామావత్ శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శాగం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అంగోతు సర్దార్ నాయక్, తాదూరు రాజయ్య చారి,ఉపాధ్యక్షులుగా దుగ్గే శివప్రసాద్, మేగావత్ శ్రీరాములు,సహాయ కార్యదర్శులుగా చిట్యాల సాయి, ధనావత్ లక్ష్మి,యూత్ అధ్యక్షుడిగా అంగోతు ముని నాయక్, మహిళా అధ్యక్షురాలిగా కటికర్ల సౌందర్యలను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు వార్డ్ మెంబర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, హక్కులు,ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పనిచేయాలని రాష్ట్ర కోఆర్డినేటర్ నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు.వార్డ్ మెంబర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి రావాల్సిన హక్కులు, గౌరవం, అభివృద్ధి అవకాశాల కోసం ఫోరం నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వార్డ్ మెంబర్లు, ఫోరం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/నలగొండ టౌన్: నగరపాలక సంస్థ మూడవ డివిజన్ పరిధిలో శేషమ్మ గూడెం చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పేర్ల శరత్ కుమార్ ఈనెల 1న నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామ శివారులో ముద్దు మాణిక్యం పారుగంత కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి మృతి చెందారు. ఆదివారం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి శేషమ్మ గూడెం మృతుడి నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,స్థానిక కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి చంద్ర,జేరిపోతుల సైదులు, పేర్ల సతీష్ కుమార్,పేర్ల గోవర్ధన్,పేర్ల హుస్సేన్ పాల్గొన్నారు.

